క్లుప్తంగా

శాకంబరీ అలంకరణలో సాయిబాబా



పెనుగొండ: ఆషాఢమాసం సందర్భంగా వడలిలో సాయిబాబా శాకంబరీ అలంకరణలో దర్శనం ఇచ్చారు. ఉదయం నుంచి ఆలయం వద్ద సాయిబాబాకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అగస్త్యేశ్వర సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వడలి గ్రామ దేవత మందాలమ్మకు సారె సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని కాపవరం ఎంపీపీ-2 బేసిక్ మోడల్ ప్రైడ్ స్కూల్లో విద్యార్థులకు పట్టణానికి చెందిన మన్యం జగ్గమ్మ సత్రం ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు అందజేశారు. గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.బేబీసరోజ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలతో పాటు దాతలు, సేవా సంస్థల సభ్యులు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వి.పద్మావతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన



మార్టేరులో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద తనిఖీ చేస్తున్న కేంద్ర బృందం

పెనుమంట్ర: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2025 తనిఖీల్లో భాగంగా గురువారం కేంద్ర బృందం మార్టేరు గ్రామంలో పర్యటించింది. ఈ సందర్భంగా కేంద్ర బృందం రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్ (ఫీల్డ్) ఎం.మధుమతి పశ్చిమ గోదావరి జిల్లా కన్సల్టెంట్ ఎం.సంతోష్ కుమార్‌లతో స్థానిక అధికారులు గ్రామంలోని పంచాయతీ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి, జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కమ్యూనిటీ టాయిలెట్స్, గుణ్ణంచెరువు డ్రెయిన్లు, అవుట్‌లెట్లతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీలో పలు రికార్డులను తనిఖీ చేశారు.

బీఎల్‌వోలకు శిక్షణ

పెనుగొండ: ఆచంట చాంబర్ ఆఫ్ కామర్స్ కల్యాణ మండపంలో గురువారం బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆచంట, పెనుమంట్ర, పోడూరు మండలాలకు చెందిన బీఎల్‌వోలకు తహసీల్దార్ జి.కనకరాజు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనీ మాస్టర్ ఏఎస్‌వో దుర్గాపసాయి, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వేగంగా వంతెన నిర్మాణ పనులు

కాళ్ల: మండలంలోని పెదఅమీరంలో నూతనంగా నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు అన్నారు. గ్రామంలోని సత్రం ఎదురుగా పంచాయతీ నిధులు రూ.5లక్షలతో నిర్మిస్తున్న వంతెన పనులను గురువారం పరిశీలించి మాట్లాడారు. గతంలో ఈప్రాంతంలో తూములతో వంతెన ఉండేదని, దానిస్థానంలో శాశ్వత ప్రాతిపదికన కాంక్రీటు బ్రిడ్జ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. వంతెన నిర్మాణ పనులు పూర్తి నాణ్యతతో నిర్మించి త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు.

మట్టి తోలకాలతో విద్యార్థుల అవస్థలు



రోడ్డుపై మట్టితో అవస్థలు పడుతున్న విద్యార్థినులు

పాలకోడేరు: నిబంధనలకు విరుద్ధంగా పాలకోడేరు మండలంలో భారీగా యథేచ్ఛగా ట్రాక్టర్లతో వ్యాపారులు మట్టిని తోలడంతో మట్టి గెడ్డలు రోడ్లపై పడటంతో గురువారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి పలు రోడ్లన్నీ బురదమయమయ్యాయి. మోగల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని గుత్తుల వారి పాలెంలోని విద్యార్థులు చదువు నిమిత్తం మోగల్లు స్కూల్‌కి వస్తూంటారు. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి గుత్తులవారిపాలెం నుంచి మోగల్లు వచ్చే రోడ్డులో మట్టి తోలకం వల్ల ఆ రోడ్డు అంతా బురదమయం కావడంతో విద్యార్థులు పరిస్థితి వర్ణనాతీతం. అధికారులు స్పందించి రోడ్డు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుచున్నారు.

రైతులపై బీమా భారం

- ఉచిత పంటల బీమాను అటకెక్కించిన కూటమి సర్కార్
- ప్రీమియం రైతులే చెల్లించేలా ఉత్తర్వులు
- బీమా నమోదుకు ఆగస్టు 15 తుదిగడువు
- రైతులపై భారం లేకుండా ప్రీమియం చెల్లించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వ తీరుపై అన్నదాతల ఆగ్రహం



యలమంచిలి మండలంలో ఖరీఫ్ పంట కోసం రైతులు వేసిన నారుమడి

యలమంచిలి: ఉచిత పంటల బీమాకు కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. ప్రీమియం సొమ్ము రైతులే చెల్లించాలన్న నిబంధనను తెరపైకి తెచ్చింది. ఈ పరిణామం రైతుల్లో ఆవేదన నింపుతోంది. అప్పులు చేసి పంటలు సాగు చేస్తుంటే, ప్రభుత్వం తమకు ఏ మాత్రం ప్రోత్సాహం అందించడం లేదని ఆవేదన చెందుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి తమకు ఒక్క పైసా ఖర్చు లేకుండా ఉచిత పంటల బీమా అందించిందని అన్నదాతలు గుర్తు చేసుకుంటున్నారు.

ప్రీమియం చెల్లింపులు ఇలా..

ఖరీఫ్ సీజన్‌లో పాలకొల్లు నియోజకవర్గంలో దాదాపు 28 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఖరీఫ్-2025 సీజన్‌కు ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లింపునకు ఇటీవల ఉత్తర్వులు వెలువరించింది. ఎకరాకు రూ.210 చెల్లించాలని ఆగస్టు 15 వరకు గడువు విధించింది. వరి సాగు చేసిన పంటలకు రైతులే స్వయంగా పంటల వారీగా ప్రీమియం చెల్లించాలని పేర్కొంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండానే పంటల బీమా అమలు చేసింది.

రైతుల పైనే భారం

కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బీమా ప్రీమియం భారం రైతులపై పడింది. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి వంట సాగు చేసే ప్రతి రైతు పంటల బీమా పొందాలంటే ప్రీమియం చెల్లించాల్సిందే. ప్రభుత్వ సాయం అందక పెట్టుబడులకు అప్పులు చేసిన రైతులు ప్రీమియం కూడా చెల్లించాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మళ్లీ రైతులకు కష్టాలు మొదలయ్యాయని నిట్టూర్చుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయం ఎప్పుడు వస్తుందో స్పష్టత లేదు. ఇలాంటి సమయంలో ప్రీమియం చెల్లించడం కష్టంగా ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాగా సమయం తక్కువగా ఉండటం, ప్రీమియం రైతులే చెల్లించాల్సి రావడంతో చాలా మంది బీమా నమోదు చేసేందుకు ముందుకు రాలేదు.

రైతులకు అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

వ్యవసాయ రంగాన్ని, రైతులను ఆదుకునే దిశగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019 ఖరీఫ్ సీజన్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని తీసుకొచ్చింది. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ-క్రాప్ నమోదు ప్రామాణికంగా ఉచిత పంటల బీమాను అమలు చేశారు. రైతులు సాగు చేసే మొత్తం విస్తీర్ణానికి చెల్లించాల్సిన ప్రీమియాన్ని ప్రభుత్వమే కట్టేలా చర్యలు తీసుకున్నారు. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా పథకం వర్తించడంతో పంటలకు నష్టం వాటిల్లిన ప్రతి సందర్భంలోనూ రైతులు పూర్తిగా నష్ట పరిహారం అందుకునే వారు. కౌలు రైతులకు సైతం పరిహారం అందించారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల ఖాతాలకే జమ చేసేవారు.

ఉచిత బీమా అమలు చేయాల్సిందే



ఉచిత పంటల బీమా రద్దు చేయడం అన్యాయం. కూటమి ప్రభుత్వం రాగానే రైతులను దెబ్బ తీసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత బీమాను కొనసాగించి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి. వ్యవసాయం చేయడం కష్టంగా మారిన నేపథ్యంలో ప్రీమియం భారాన్ని రైతులను భరించమనడం సరికాదు. దీనిపై కూటమి ప్రభుత్వం పునరాలోచించాలి. దీని వలన చిన్న, సన్నకారు రైతులపై తీవ్రమైన భారం పడుతుంది.

–మంద హరికుమార్, రైతు, కాంబొట్లపాలెం

బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి



ఉచిత పంటల బీమాను ప్రభుత్వమే చెల్లించాలి. గతంలో అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తే మాలాంటి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పెట్టుబడికే డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటే బీమా ప్రీమియం భారం రైతులపై వేయడం సమంజసం కాదు. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడిసాయం అందజేయాలి. ప్రభుత్వం రైతులకు అండగా ఉండాలి.

–గణపాబత్తుల ఏసుబాబు, రైతు, గుంపర్రు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో విద్యుత్ మరమ్మతులు, ట్రీ కటింగ్ నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ కె.మధుకుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో శ్రీరామ్‌పేట, బస్టాండ్ ఏరియా, మావుళ్లమ్మపేట, శాంతినగర్, వడలివానిపేట, కెనాల్ రోడ్డు ఏరియాలో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. అలాగే పోడూరు మండలంలో పెనుమదం, గుమ్ములూరు, పైడావ, బండారు చెరువు, అప్పనచెరువు, రాజుల గరువు గ్రామాలకు, యలమంచిలి మండలంలో కాజ వెస్ట్, గగ్గిపర్రు, ఆడవిపాలెం, ఇలపకుర్రు, మట్లపాలెం, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, బూరుగుపల్లి, కంచుస్తంభం పాలెం, లక్ష్మీపాలెం, గంగడపాలెం గ్రామాల్లోనూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

పెనుగొండ: తూర్పుపాలెంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆచంట మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జక్కంశెట్టి చంటి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

పిల్లలకు అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్పాలి

నరసాపురం: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్పడానికి అధ్యాపకులు సిద్ధంగా ఉండాలని వైఎస్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అందే రామసతీష్ అన్నారు. వైఎస్ బీఈడీ కళాశాలలో గురువారం బోధనోపకరణాల ద్వారా బోధన అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. బోధనోపకరణాల ద్వారా బోధించడం ద్వారా క్లిష్టమైన పాఠాలు కూడా విద్యార్థుల మనస్సుకు హత్తుకునే విధంగా అర్థమవుతాయన్నారు. అలాంటి సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శాంతి, డిగ్రీ ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, వైస్ ప్రిన్సిపాల్ ముత్యాల కల్యాణ్, అధ్యాపకులు ఆర్.దేవి, సీహెచ్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో రైతులకు మేలు



గ్రామ సభలో మాట్లాడుతున్న దాసి రాజు

పెనుగొండ: రీసర్వేతో రైతుల భూ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అన్నారు. గురువారం సిద్ధాంతం పంచాయతీ వద్ద జరిగిన రీ సర్వే గ్రామ సభలో పాల్గొన్నారు. ల్యాండ్ పార్సిల్ మ్యాప్ నంబర్ ఇద్దరు రైతులకు కలిపి ఒకటే ఉండడంతో సంక్షేమ పథకం అమలులో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రైతులు ఈ సమస్యల పరిష్కారానికి స్థానిక రెవెన్యూ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.అనితకుమారి, ఎంఈవో పి.రామకృష్ణ, సర్పంచ్ చింతపల్లి గనిరాజు (చంటి), రైతులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ఉద్యోగులపై ఒత్తిడి



పార్టీ నాయకులను అభినందిస్తున్న గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: నేటి కూటమి పాలనలో ఉద్యోగులపై ఒత్తిడి పెరిగిందని నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇటీవల నూతనంగా పదవులు అలంకరించిన నాయకులను అభినందించారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడుతూ నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అధికారులు ప్రజలకు అవసరమైన సంక్షేమ ఫలాలు అందించాలన్నా, అభివృద్ధి పనులు చేయాలన్నా స్వేచ్ఛగా పనులు చేసేవారని నేడు నియోజకవర్గంలో ఆ పరిస్థితి లేకుండా పోయిందన్నారు. చిన్న చిన్న రోడ్లు వేయాలన్నా స్థానిక తెలుగు తమ్ముళ్లకు చెప్పాలని లేదంటే ఆ పని ప్రజలకు ఎంత అవసరమైందైనా సరే ముందుకు సాగే పరిస్థితి లేదన్నారు. తమకు అందరూ కావాలని ఇప్పుడు ఓ ప్రభుత్వం ఉంటే తరువాత మరో ప్రభుత్వం రావొచ్చని అందరినీ కలుపుకుంటూ సమన్యాయం పాటిస్తూ తాము విధులు నిర్వహిస్తుంటామని నేటి పరిస్థితి అలా లేదని వాపోతున్నారు. ఒక్క సంవత్సరంలోనే కూటమి పాలనపై ఇటు ప్రజలకు అటు ప్రభుత్వ అధికారులకు విసుగుపుట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం పాలన చూసిన ప్రజలకు సంవత్సర కాలానికే జగనన్న పాలనే మెరుగనే పరిస్థితికి తీసుకొచ్చారన్నారు. ప్రజలు ఇంకా నాలుగేళ్లు ఈ ప్రభుత్వంతో ఇబ్బందులు పడాలని నిట్టూరుస్తున్నారని గోపి అన్నారు. ఈ సందర్భంగా ప్రచార కమిటీ వింగ్ అధ్యక్షుడిగా ఎంపికైన కెల్లా పెద్దిరాజును అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యడ్ల తాతాజీ, కోరాట శ్రీనివాస్, బండి రమేష్, మోర్త గిరీష్, కొరగింజల శ్రీనివాస్, ఎడ్ల సత్యనారాయణ, బుజ్జి, సాల్మన్‌రాజు, ఉప్పే పండు, మానుకొండ శ్రీను, కోట రత్నరాజు, మండెల ప్రసాద్, గేదెల నరసింహరావు, పెద్ద మాధవ్, దుర్గారావు, గుండుబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మున్సిపల్ వాటర్ అమ్ముకున్న వారిపై చర్యలేవి?



ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య(ఫైల్)

నరసాపురం: పట్టణంలోని 30వ వార్డులో బండారు సుబ్బారావు ఏకంగా మున్సిపల్ వాటర్‌ను అమ్ముతూ అడ్డంగా దొరికిన వ్యవహారంలో ఆ వ్యాపారిపై మున్సిపల్ అధికారులు కరుణ చూపించారు. వ్యాపారిపై కేసు పెట్టాల్సింది పోయి, అతడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న ట్యాంకర్‌ను తిరిగి అతడికి అప్పగించారు. స్థానిక కౌన్సిలర్‌ను సంప్రదించకుండా, స్థానికులు ఇచ్చిన ఫిర్యాదును పట్టించుకోకుండా మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య వ్యవహరించిన తీరుపై విమర్శలు వస్తున్నాయి. మామూళ్ల మత్తులో మున్సిపల్ అధికారులు ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ నెల 4వ తేదీన సుబ్బారావు మోటార్ ద్వారా కుళాయి నీటిని తన సొంత ట్యాంకర్‌లోకి ఎక్కించి, టిన్ను వాటర్ రూ.50 నుంచి 100లకు అమ్మకం చేస్తుంటే స్థానికులు అడ్డగించి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ వచ్చి స్థానికుల నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదు తీసుకొని ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా స్వాధీనం చేసుకున్న ట్యాంకర్‌ను మళ్లీ అతడికి యథావిధిగా అప్పగించారు. దీనిపై స్థానికులు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని భావిస్తున్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు చెక్కులు అందజేస్తున్న వసుధ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్

పాలకొల్లు సెంట్రల్: వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇద్దరు అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. గురువారం ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ బుద్ధరాజు మాట్లాడుతూ చినఅమిరం గ్రామానికి చెందిన గొట్టుముక్కల బలరామరాజు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. అలాగే మొగల్తూరుకు చెందిన పెన్మెట్స మోహనరావు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందగా భార్య మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని వారి కుటుంబాల సమస్యలు తెలుసుకున్న వసుధ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మంతెన వెంకటరామరాజు బాధితులు ఇద్దరికి చెరో రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వేంద్ర బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆర్థిక సాయం

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మానవ సైజమని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. గురువారం స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ కుటుంబానికి రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ పట్టణానికి చెందిన సోమేశ్వరరావు టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, అతని మనవడికి బ్లడ్ క్యాన్సర్ సోకడంతో వైద్యం చేయించడానికి ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారనే సమాచారం తమ క్లబ్ సభ్యులకు తెలిపారన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పీర్ సాహెబ్, పోతుల ఉమాశంకర్రావు, మానెం బసవరాజు, ధనాని శ్రీరామ్మూర్తి, సలాది రామచంద్రరావు, జవ్వాజి కళ్యాణ్, సోమంచి శ్రీనివాసశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న వాకర్స్ సభ్యులు

24న దివ్యాంగులకు ఉపకరణాల శిబిరం

కాళ్ల: నియోజకవర్గంలోని కాళ్ళ, ఉండి, ఆకివీడు, పాలకోడేరు మండలాల పరిధిలోని దివ్యాంగులకు ఉపకరణాలైన కృత్రిమ కాళ్లు, చేతులు, వినికిడి సాధనాలు మొదలైన పరికరాలను అందజేసేందుకు ఈనెల 24న ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు కాళ్ళ ఎంపీడీఓ జి.స్వాతి గురువారం తెలిపారు. నియోజకవర్గ కేంద్రమైన ఉండి హైస్కూల్లో అర్హత, నిర్ధారణ పరీక్షలు చేస్తారన్నారు. నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులు తమ ఆధార్, సదరం సర్టిఫికేట్, రేషన్ కార్డు, 2 ఫోటోలు తీసుకొని ఉదయం10 గంటలకు శిబిరానికి హాజరుకావాలని కోరారు.

మనుషుల అక్రమ రవాణాను నిరోధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో ఇందిర

పాలకొల్లు సెంట్రల్: మనుషులు అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరమని ప్రతి రోజూ ఎంతో మంది అమ్మాయిలు ఈ అక్రమ రవాణాకు గురవుతున్నారని సీడీపీవో సీహెచ్ ఇందిర అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ వారిచే అక్రమ రవాణాపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీహెచ్ ఇందిర మాట్లాడుతూ మహిళలు, అమ్మాయిలు ఎక్కువగా అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాల ద్వారా మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారన్నారు. ప్రజ్వల కో-ఆర్డినేటర్ శ్రావ్య శృతి మాట్లాడుతూ ఈ అక్రమ రవాణాకు, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వలు స్వచ్ఛంద సంస్థ గత 28 సంవత్సరాలుగా పద్మశ్రీ డా సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్, విద్యాశాఖ, న్యాయశాఖల సమన్వయంతో ఇప్పటి వరకూ 29,200 మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించారన్నారు. సమస్య ఎదురైనపుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల కోఆర్డినేటర్ అనిల్ కుమార్, చెన్నకేశవులు, సుధ, మల్లీశ్వరి, మంగ,అంగన్‌వాడి టీచర్స్ పాల్గొన్నారు.

వాసవీ మాతకు సారె



వాసవీమాతకు సారె సమర్పణలో ఆకట్టుకున్న శక్తి వేషధారణలు

పెనుగొండ: ఆషాఢమాసం సందర్భంగా వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ 32 జిల్లాలకు చెందిన వాసవీక్లబ్ సభ్యులు పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి 32 రకాల సారె సమర్పించారు. గురువారం ఉదయం నుంచి పెనుగొండ ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. పెనుగొండలోని జవ్వాది వారి బజారు రామాలయం నుంచి వాసవీ క్లబ్ సభ్యులు గ్రామోత్సవం నిర్వహిస్తూ తరలి వచ్చారు. బాణసంచా కాల్పులు, గరగ నృత్యాలు, కాళికామాత శక్తి వేషధారణలు, కోలాట భజనలు, సన్నాయి వాయిద్యాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు.

దేవతలారా.. దీవించండి



అమ్మవార్లకు అలంకరించే శాకంబరి మాలలు తయారు చేస్తున్న భక్తులు



వనుములమ్మ



కనకదుర్గమ్మ

పెనుమంట్ర: నెగ్గిపూడి గ్రామంలో వేంచేసియున్న గ్రామ దేవతలు శ్రీవనుములమ్మ, శ్రీకనకదుర్గమ్మ అమ్మవార్లు శుక్రవారం శాకంబరి అలంకరణలో దర్శనమివ్వనున్నారు. ఆషాఢమాసం పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం మహిళలు, ఆడపడుచులు శ్రీసోమేశ్వర ఆలయం నుంచి సారెను తీసుకొచ్చి అమ్మవార్లకు సమర్పించనున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యుడు మాజీ సర్పంచ్ అల్లం భాస్కరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని అలంకరించేందుకు గురువారం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని శాకంబరీ మాలలు తయారు చేశారు.

అమ్మవార్లకు సారె సమర్పణ

పెనుగొండ: ఆషాఢమాసం సందర్భంగా గురువారం ఆచంట మండలం పెదమల్లం గ్రామ దేవతలు పల్లాలమ్మ, మారేమ్మ, కోట్లమ్మ అమ్మవార్లకు సారె సమర్పించారు. పలు రకాల స్వీట్లు, గాజులు, చీరలతో మహిళలు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ, బోడపాటి బాబులు, యూత్ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.